స్వస్తి

ఎటువైపు వీస్తుందో దిక్కుతెలియని విసురుగాలిలో, ఎగిసిపడే కొలిమి సెగల్లాగా ఎండ.

ఎమ్మెల్యే ఇంట్లోలేడు. ఆ పనులకూ, ఈ పనులకూ, ఘర్యాదలకూ, మంతనాలకూ వచ్చీపోయేవాళ్ల రద్దీ లేదు; సందడీ లేదు. గన్‌మెన్ ఇద్దరికీ తెరపి దొరికింది. కాంపౌండ్ బయట గేటుకు కొంచెం అటుగా నిలబడ్డారు ఇద్దరూ; గుండెలనిండా సిగరెట్ల పొగను పీల్చుకున్నారు. మాటల్లో పడ్డారు.

"మన సార్‌కు ఏడుగురు గన్‌మెన్‌లు ఎందుకు? నేనూ, నువ్వు - మనం ఇద్దరమే - పోనీలే రజాక్‌తో కూడా కలుపుకొని మనం ముగ్గురమూ చాల్దా? సార్ మనకు ఉద్యోగాలు ఇప్పించినాడు. ఎప్పటినుంచో చూపెట్టుకొని ఉంటున్నాం. సార్ మన మేలు కోరతాడు. సార్ మేలు మనం కోరతాం. సార్ అంటే మనకు ప్రాణం లేదా?" మరో గన్‌మెన్ వీరన్నను, నాగిరెడ్డి అడిగాడు.

"ఇదిగో రెడ్డీ!" నాగిరెడ్డి ముఖంలోకి చూస్తూ, వీరన్న పలకరింపుతో మొదలుపెట్టి, చెప్పబోయాడు.

"అట్లా పిలవద్దు. మనిద్దరం పిల్లప్పటినుంచి కలిసి చదువుకున్నాం. ఇద్దరం చేసేది ఒక ఉద్యోగమే. ఆ మాట కొస్తే నువ్వు నాకు మూడేండ్లు సీనియర్. నాగూ! అను చాలు" అన్నాడు నాగు.

"అలవాటులే అబ్బా! మా నాయన అలవాటు. మన పల్లెల అలవాటు. నా కులం నాకు గుర్తుకొచ్చిందిలే. ఏదో మాదిగ రిజర్వేషన్ల పోరాటం వార్తలు ఇంతకుముందే చదివినాలే. పేర్ల వెనుక ఏ తోకలుంటే ఏముంది? కూడు ముఖ్యం

గానీ! నువ్వు అడిగింది బాగుంది. సరే గానీ నువ్వెప్పుడన్నా గాంధీ మూడు కోతుల్ని గురించి వినలేదా?" వీరన్న అటూ ఇటూ చూస్తూ అన్నాడు.

"సరిగ్గా గుర్తులేదు. చదివిన చదువు ఎప్పుడో మర్చిపోతి. అయినా, మధ్యలో అసలు ఈ కోతులెందుకు వచ్చినాయి? నేనడిగింది చెప్పు మన సార్‌కు ఏడుగురు గన్‌మెన్‌లు ఎందుకు, మనం ఉన్నప్పుడు?" నాగు కాస్తా మొండిగా అడిగాడు.

"చెడ్డ చూడకు, చెడ్డ వినకు, చెడ్డ మాట్లాడకు", వీరన్న కొంటెగా నవ్వాడు.

"ఇదో వీరన్నా! మనం చూసేదేంది? వినేదేంది? మాట్లాడేదేంది? మన సార్‌ను చూసుకుంటున్నాం. మన సార్ చెప్పినట్లు వినుకుంటున్నాం. మన సార్ బాగోగులు మాట్లాడుకుంటున్నాం. ఇందులో చెడ్డ ఏముంది? నీ తలతిక్క మాటలుగానీ!" నాగు అసహనంతో సిగరెట్ ముట్టించాడు.

"మరి, నువ్వెందుకు ప్రత్యేకంగా ఇది అడిగినట్లు?" వీరన్న 'ఇది' అనే మాటను నొక్కి అడిగాడు.

"నేనా? నేనా?" నాగు బయటపడటానికి సందేహించాడు.

"నాకు తెలుసు, నువ్వు ఈ పొద్దు పేపర్లో చదివినావు - అవతల పార్టీ నాయకుడు పత్రికకు స్టేట్‌మెంట్ ఇచ్చి నాడని - బొజ్జారెడ్డికి ఇందరెందుకని? నిజమా కాదా?"

అంగీకరిస్తున్నట్లు నాగు తల ఆడించాడు. "అదిసరే..." అని కొన్నిక్షణాలు ఆగాడు.

వీరన్న మాటలమధ్యలో అడ్డుతగులుతూ సర్దుబాటుగా అన్నాడు:

"మనకు ఈ ఇంటిదగ్గిర డ్యూటీ ఉండవచ్చు. సార్ వెంబడి డ్యూటీ ఉండవచ్చు. మనమే 24 గంటలూ సార్ వెంబడే ఎట్లా ఉండగలుగుతాం చెప్పు? ఇదంతా ఎందుకు తంటా, మనకు?"

"నువ్వనేది నిజమే..." నాగు నసిగాడు.

"సార్ వెంబడి ఆ లక్ష్మీరెడ్డే ఎందుకుండాల? ఆ కృష్ణయ్యే ఎందుకుండాల? ఇదేనా నీ మనసులో ఉండేది?" వీరన్న సూటిగా అడిగాడు.

నాగు బదులు పలకలేదు.

"చూడూ! లక్ష్మిరెడ్డి మన సార్ భార్యతరపున చాలా దగ్గిర చుట్టం. కృష్ణయ్య మూడుతరాలుగా సార్ కుటుంబాన్నే నమ్ముకుంటూ వస్తున్న కుటుంబం. ఆ బోయవాళ్ళందరూ సార్ కుటుంబం ఎటువైపుంటే, అటువైపుంటూ వచ్చినారు. ఎక్కడ దూకమంటే అక్కడ దూకినారు. ఏం చేయమంటే అది చేసినారు. ఖూనీలు చేసినారు. ఖూనీ లయిపోయినారు. కోర్టుల చుట్టూ తిరిగినారు. ఇప్పుడూ చూపెట్టుకొని ఉన్నారు. ఇవన్నీ నువ్వు వినలేదంటావా? మిగతా ఇద్దరి సంగతి - వెంకటయ్య, జోసఫ్ - వాళ్ళూ మన మాదిరిగానే... ఏమీ మనసులో పెట్టుకోకు.

మనకెందుకొచ్చిన తంటా? ఈయన అడిగినాడు. ప్రభుత్వం మనల్ని పంపింది. ఏ డ్యూటీ చెయ్యమంటే, ఆ డ్యూటీ చెయ్యడమే మన పని...” వీరన్న మరేదో చెప్పబోయాడు. ఇద్దరు యువకులు కాంపౌండ్ లోపలినుంచి, బయటకు రావడంతో వాళ్ళ మాటలు ఆగిపోయాయి.

“వదిన ఇంట్లోకి రమ్మని పిలిచింది”, ఒక యువకుడు వీరన్నకు చెప్పాడు. ఏం డ్యూటీనో అనుకుంటూ వీరన్న త్వరత్వరగా లంకంత ఇంట్లోకి వెళ్ళాడు.

నాగు స్వగతంలోకి జారుకున్నాడు:

‘91లో బి.ఏ. పరీక్షకు కూర్చుంటే, మూడేళ్ళకు పాసయింది తెలుగు ఒక్కటే. అన్నీ పోయినాయి. మళ్ళా ఒక్క సంవత్సరానికి పైగా చదివి చస్తే...

సప్లిమెంటరీ పరీక్షలు కూడా ముంచినాయి. ఇంకేం పాసు? ఇంకేం బి.ఎ. డిగ్రీ? ఉద్యోగం లేదు, సద్యోగం లేదు. ఊళ్లో తన మాదిరి వాళ్లందరి మాటలు, చేతలు, తెలుగుదేశం, కాంగ్రెస్ రాజకీయాలు. చిన్నా చితకా గలాటాలు. ఏ గాలి ఎటువైపు వస్తాదో తెలియదు. ఏ మంట ఎప్పుడు రగులుతుందో అర్థంకాదు. ఏ కొంపకు ఎప్పుడు ఏది చుట్టుకుంటుందో తెలియదు. ఏ కుటుంబం ఎప్పూడారిపోతుందో అసలు తెలియదు. ఏది ఎందుకు ముంచుకొస్తుందో నెత్తిగొట్టుకున్నా ఏమీ అర్థంకాదు. అయోమయం అంకాళమ్మ తిర్నాల.

ఎవరి సంగతో ఎందుకు? స్వంత ఇంటి సంగతి...

ఒక ఊరి రెడ్డి మరొక ఊరికి పసల పోలిగాడు. నాయన ఊళ్ళోనే పసల పోలిగాడు. పేరుకే కాపోడు. పేరు వెనక తోక ఒకటి మాత్రం - రెడ్డి! పాతకాలం గొల్లోళ్ళకూ, మాలా మాదిగిండ్ల పిలుపులకూ మాత్రం రెడ్డి! అయితే మాత్రం?

నాయన అన్నదమ్ములు ముగ్గురు. చిన్నాయనలతో కలిపి నలుగురు. పంపకాలుబోతే పెద్ద దుప్పటి అంత భూమి పుట్టుగోచీ అంత అయింది. పది అంకణాల అబ్బల కాలంనాటి ఇల్లు పంచుకుంటే, జ్యేష్ఠ భాగం కింద నాయనకు నాలుగు అంకణాలు వచ్చింది. నాయన కనింది అయిదుగుర్ని. అక్కను ఒక తలమాసినోడికి కట్టబెట్టినారు. నలుగురన్నదమ్ములు పంచుకోవాలేగానీ ఒక్కొక్కరికి మూడెకరాల చిరిగిన గోచీముక్కలు దొరుకుతాయి. అందుకే భాగాలు పోడానికే భయపడినారు. ఇప్పుడున్న పరపతి కూడా పోతుందని అందరికీ తెలుసు. పరపతి అంటే అప్పులు తెచ్చుకోగలిగిన శక్తి! ఇల్లు పంచుకుంటే తలా ఒక్క అంకణం - గొడ్ల గాటిపాటంత కూడా రాదు. చదువెవరికీ అబ్బలేదు, తనకు తప్ప. అందరూ ఎప్పుడు పండుతుందో, ఎప్పుడు ఎండుతుందో తెలియని భూమి మీద, చేస్తూ పోతున్న అప్పుల మీద బతుకుతున్నారు. అది గండమో తెలియదు, పీర్ల గుండమో తెలియదు. అన్నలకు గంతకుదగిన బొంతలు దొరికినారు, చాకిరి బతుకులు!

ఏ దారీ ఏ దిక్కూ తెలియక ఉక్కిరి బిక్కిరవుతున్న ఆ రోజుల్లో, ఒకరోజు...

విధురా అశ్వత్థం వైపునుంచీ అమ్మవైపు బంధువు - తమ్ముడి వరస - ఉన్నట్టుండి దిగినాడు. తనకు మామ వరస. నాయనతో అదీ ఇదీ మాట్లాడినాడు. "నాగిరెడ్డిని నాతో పంపండి. ఇటు మీ పక్క ఒక మండలం అధ్యక్షుడు బొజ్జారెడ్డి మన బంధువే. మాకు దగ్గిరలే. బొజ్జారెడ్డిది అట్లాంటి ఇట్లాంటి పలుకుబడి గాదు. భూములున్నాయి. కంట్రాక్టులున్నాయి. ఇండ్ల స్థలాలున్నాయి. ఏవేవో ఉన్నాయిలే. వచ్చే ఎన్నికల్లో తప్పక ఎమ్మెల్యే అవుతాడు. నాగిరెడ్డి ఉద్యోగం పూచీ నాది" అన్నాడు. కరువు రోజుల్లో ఇంట్లో తిండికి ఒకడు తగ్గినా తగ్గినట్లే. నాయన కష్టాలు నాయనవి. ఒప్పుకున్నాడు. తానూ 'సరే' నన్నాడు.

'సార్' పరిచయం అట్లా మామ వల్ల దొరికింది. 'సార్'తో, 'సార్' బంధువుల కుటుంబాలతో రెండేళ్ళకు పైగా మొదట్లో బెరుకుగా ఉండేది. ఇబ్బంది అనిపించేది. భయం వెంటపడేది. ఇంటిదగ్గరకంటే మంచి భోజనం - హాస్టల్లో కంటే కూడా. ఖర్చులకు అంతో ఇంతో, జీతం లాగా డబ్బు చేతికిచ్చేవాళ్ళు. బయట ఇంతకంటే బాగా బతికే యోగం లేదు. ఈ జీవితం నెమ్మదిగా అలవాటయింది. ఏవో నాలుగైదు గలాటాల్లో మూడు నాలుగు సార్లు తాను బాంబులు వేసినాడు. సార్ వాళ్ళ బంధువులు ఎక్కడికి రమ్మంటే, ఎక్కడ ఏ ఊళ్ళో, ఏ టౌన్లో విసరమంటే అక్కడ... పేలినాయో లేదో చూడలేదు. నలుగురితోపాటు నారాయణ. నిండా మునిగినాక చలి ఏముంది? కేసుల్లో దొరకలేదు. నయం. తను పండ్లచెట్లను నరకలేదు. వాములు కాల్చేవాళ్ళూ, పంటను నాశనం చేసేవాళ్లూ తన దృష్టిలో ఒకటే.

'బొజ్జారెడ్డి సార్' అట్లా ఎమ్మెల్యే అయినాడో లేదో, సంవత్సరం తిరగకుండానే కానిస్టేబుల్ సెలక్షన్ వచ్చింది. ట్రెయినింగ్ అయింది. అట్లా పూర్తి అయిందో లేదో తాను ఊళ్లో ఉన్నప్పుడు మామ వచ్చినాడు. నాయన గొంతు మీద కూర్చున్నాడు. "మా నాలుగో పిల్లను చేసుకోండి" అన్నాడు. "ఇద్దరు కొడుకులు, ఆరుమంది కూతుర్లున్నారు. పదైదు తులాల కంటే పెట్టలేను. పెళ్ళి చెయ్యిస్తాను" అని మామ అన్నాడు. "నాకు ముందే అనుమానం, నువ్వు మావాణ్ణి తీసుకపోయినప్పుడే" అన్నాడు నాయన. "చదువుకు పెట్టిన ఖర్చులన్నా రావద్దా?" అని అన్నల గొడవ. చిన్నన్న అననే అన్నాడు. "సన్నాసీ సన్నాసీ రాసుకుంటే బూడిద రాల్తుంది" అని. 'మన శివుడికి బూడిదే ఆస్తి' అని తెలుగు లెక్చరర్ చెప్పినాడు.

"మామ మనకింత సాయం చేసినాడు. మీరు నాకు భాగం పంచివ్వద్దులే!" అన్నాడు తాను. ఆ మామ నాలుగో పిల్లను తాను ముందు చూసినాడు. బాగుంటుంది. బాగా. అది నాయన, అన్నలకు తెలియదు. మొండికిబడి, భాగం తీసుకున్నా చెడ్డపేరు తప్ప మిగిలేదేముంది? పదైదు తులాలు మిగులుతాయి. కనీసం పెళ్ళాం మీద ఉండేవి. ఇచ్చేవాడుంటే చచ్చేవాడు లేచి వస్తాడు. దరిద్రుడికి దక్కిందే బొక్కుడు.

పెళ్ళి అయింది. పెళ్ళికి సార్ వచ్చినాడు.

తన గౌరవమూ, కుటుంబం పరపతీ పెరిగినాయి. అయిదారు నెలలు గడిచినాయో లేదో సార్ దగ్గర గన్‌మాన్‌గా పోస్టింగు. నమ్మకమైన గన్‌మాన్‌గా అభిమానం సంపాదించుకున్నాడు. చేతులు చాచకుండానే సార్ కోసం వచ్చిన వాళ్లు కాసులిస్తే, నాలుగు డబ్బులు కళ్ళ చూసినాడు. తన తిండి ఖర్చులు మామూలుగా బయటే. వీరన్న, రజాక్ కొద్దిరోజుల తర్వాత గన్‌మెన్‌లుగా చేరినారు. స్నేహితులు చేరడంతో సంతోషమైంది. ఎవరి కొంపల మీదికి ఏది రాలేదు - ఇంతవరకూ అదృష్టం!

ఈ లక్ష్మిరెడ్డి, క్రిష్టయ్య అదొక రకం. తామే 'సార్' కుటుంబానికీ, వాళ్ళ బంధువులకూ చాల దగ్గరైనట్టు మాటలూ, చేతలూ. వీరన్న చెప్పింది నిజం. వీరన్న తెలివిగలవాడు. ఎప్పుడన్నా కొంచెం తాగినా, అన్ని రాజకీయాల్నీ కలేసి తిడతాడు. ఎవర్ని ఎందుకు తిడుతున్నాడో తెలియకుండా తిడతాడు. ఏం బాధలు పడినాడో? తనకంటే ఎక్కువ పడినాడేమో - కులం తక్కువవల్ల? తనకు తెలియనివి వీరన్నకు చాలా తెలుసు. పూర్తిగా తెలుసు... తనకెందుకు తెలియదు? వీరన్నకంటే తనవి తక్కువబాధలు!

ఆ మధ్య ఒక రోజు రాత్రి సార్ చీనీ తోటలోని ఇంట్లో-ఫార్మ్ హవుస్ అంట! దాంట్లో విందు భోజనాలు. ఇప్పుడున్నన్ని గొడవలు లేవు. పెద్ద పెద్ద కంట్రాక్టుల్తో గొడవలు వచ్చినాయి. ఆ విందుకు ఎవరెవరో మండలాధ్యక్షులు, జడ్‌పి ఛైర్మన్, ఎమ్మెల్యేలు, బంధువులు - ఆరుగురో ఏడుగురో వచ్చినవాళ్ళు పీకలదాకా తాగినారు. కుతికలదాకా తిన్నారు. వాళ్ళను ఏగడం కూడా తమ పనే! సార్ తాగడు. స్నేహితులు తాగుతూంటే చూసి ఆనందపడతాడు. "సార్, మీరు తినండి" అన్నాడు తాను. "మీది కానివ్వండి. అందరిదీ అయిపోయింది. భోజనాలయ్యాక బయట జాగ్రత్త" అన్నాడు సార్. నలుగురి గన్‌మెన్‌ల భోజనాలయినాయి. ఇద్దరు బయట, ఇద్దరు లోపల కాపలా. లోపల ఇంకా కొంతమంది వేరే జనం. చీనీ చెట్ల ఆకుల సవ్వడి తప్ప, ఏ అలికిడీ లేదు.

తానూ, వీరన్న బయట కూర్చున్నారు. గన్నుల మీద చూపు తప్పదు. డ్యూటీ!

"ఏం డిన్నర్? వీరన్నా! అదిరిపోయింది" అన్నాడు తాను. వీరన్నకు మనసులో ఏముందో తెలియదు. కొంచెం మైకంలోని ఉల్లాసం ఉందేమో? ఎప్పుడూ ఏదీ నేరుగా బయటపడని మనిషి తటాలున అన్నాడు:

"అందరికీ అదిరిపోయింది. ఏం లాభం? మనం తినినాకనే మిగిలింది ఈ సార్ ఎంగిలి పడడం, ఎవరూ చూడకుండా. ఎంతుంటే ఏం సుఖం? ఇంకా ఇంకా కావాలని ఎంత వెంపర్లాడితే ఏం మిగులుతుంది? బూడిద! చుట్టూ కాపలాగా ఎందరుంటే ఏం లాభం? నేను నిన్ను చంపితే ఊరుకుంటారా నీవాళ్ళు? ఈ మధ్య వసంతసేన అని ఒక నాటకం చదివినాలే. నా పని ఆ నాటకంలోని విటుడులాగా వుంది."

ఎవరైనా విన్నారేమోనని తనకు భయం వేసింది. ఎవరూ వినలేదు. మతిపోయింది తనకు. ఆ వసంతసేన నాటకం తను చదవలేదు. నాటకంలోని ఆ విటుడు ఎవడో తనకు తెలియదు. విటుడంటే? ఓహ్!

అట్లాంటి వీరన్న ఇందాక మూడు కోతుల సంగతి చెప్పినాడు. అప్పుడప్పుడూ వీరన్నే కోతి... ఆంజనేయుడి మాదిరి కోతా?'

తన మిత్రుణ్ణి కోతి అనుకున్నందుకు, నాగుకు నవ్వు వచ్చింది.

జీపులనూ, కార్లనూ దూరం నుంచే చూసిన యువకులు గేటువైపు పరుగెత్తుకుంటూ వచ్చారు. నాగు నిటారుగా నిలబడ్డాడు రైఫిల్‌తో పెద్దగేటు తీశారు. పక్క వీరన్న నిట్టనిటారుగా రైఫిల్‌తో నిలబడి...

ప్రయాణం పడింది. "రేపు ఉదయం జమ్మలమడుగులో పెళ్ళి" అని ఒక డ్రైవర్ చెప్పాడు - అదీ రహస్యం చెబుతున్నట్టుగా. రాత్రి కొండాపురంలో విడిది. ఏర్పాట్లకు లోటులేదు. మందీ మార్బలం ఉండనే ఉన్నారు.

చీకట్లు విచ్చుకొనే సమయంలో జీపులూ, కార్లూ ముద్దనూరు వైపు బయలుదేరాయి. గండికోట కొండలకింద రోడ్డు...

ముందు కమాండర్ జీపు.. వెనుక అంబాసిడర్. దాని వెనుక మారుతి. ఆ వెనుక సుమో. ఆ దాని వెనుక మరొక్క జీపు. వెనుక అంబాసిడర్. దాని వెనుక మారుతి. ఆ వెనుక సుమో. ఆ దాని వెనుక మరొక జీపు. అన్నీ సిద్ధంగా, అంతా సిద్ధంగా. అందరూ కలకలగా, దర్పంగా గన్‌మెన్ తోడుగా.

నాగుకు ఈసారి ప్రయాణం ఆనందంగా వుంది. బండ్ల వరస మారింది. బండ్లలో మనుషులు మారారు. అంబాసిడర్ ముందు సీట్లో నాగు కూర్చున్నాడు. వెనుకసీట్లో కాస్త కుడి ఎడమ వైపు ఎం.ఎల్.ఎ. బొజ్జారెడ్డి జారిగిలబడ్డాడు. కుడివైపు కారు తలుపుకు ఆనుకొని రజాక్. తనకేదో పదోన్నతి లభించినట్టు సార్‌కు తనెంతో దగ్గిరైనట్టు నాగు అనుకున్నాడు.

'వీరన్న, చెల్లెలి పెళ్ళి అని ఊరికిపోయినాడు. ఉండివుంటే ఇంకా బాగుండేది. సుమోలోని లక్ష్మిరెడ్డి, కృష్ణయ్య కుళ్ళుకుంటూ ఉంటారు అనుకున్నాడు. వీరన్న వచ్చినాక తమాషా చెప్పాలని అనుకున్నాడు.'

మంగపట్నం దాటుతున్నారు.

పది పండ్రెండు పిడుగులు పడినట్టు కిందా, పైనా అదిరిపోయే శబ్దాలు

"కోబలీ!"

"నరకండ్రా, నా కొడుకుల్ని!"

"ఎక్కడికి పోతారు?"

"కాల్చండ్రా!"

"మన బాంబులు విసరండ్రా!"

"దొంగవేటు వేసినార్రా!"

"చంపినార్రా నా కొడుకులు!"

"అయ్యో... అమ్మో... నాయనా... నా పెండ్లాం, పిల్లలు.... అమ్మో... అబ్బో..."

కేకలు, అరపులు, పెడబొబ్బలు, ఉరుకులు, పరుగులు, గన్‌మెన్ కాల్పులు, బాంబుల దబ్బుటవాన, కాల్పుల జడివాన. ఏం జరుగుతుందో తెలియని అయోమయం. అక్కడ తెగింపు ఒక్కటే నిజం. కోపం, భయం, పగ శత్రువుల్ని ఎదుర్కోవడం అంతే...

పదిహేను నిముషాల యుద్ధం. దెబ్బతీసినవాళ్లు అయిపులేరు.

శ్మశాన ప్రశాంతత.

దెబ్బతిన్నవాళ్ళపక్షం గజగజ వణికిపోతూంది.

బొజ్జారెడ్డి సెల్‌ఫోన్ నిమిషాల్లో సహాయం అందించలేని చోట బీభత్సం.

ఇది జరిగి పదిరోజులైనాగానీ, నాగు భీతి తగ్గిపోలేదు. నిద్రలో ఉన్నట్టుండి ఉలికిపడిపోతాడు. కేకలు వేస్తాడు. గజగజ వణికిపోతాడు. పలకరిస్తే మాట్లాడడు. వెర్రిచూపులు చూస్తాడు. భార్యది చెప్పుకోలేని దుఃఖం. రోజూ బంధువులు పలకరించిపోతున్నారు. నాగు మామ, కూతురుకూ, కూతురు పిల్లలకూ తోడుగా ఉన్నాడు.

ఊరి నుంచి వచ్చిన వీరన్నకు విషయాలన్నీ తెలిశాయి. నాగు ఇంటికి వచ్చాడు. రజాక్‌ను వెంటబెట్టుకొని, నాగు పక్కన కూర్చున్నారు.

"ఏమైంది నీకు, అంత ధైర్యంగా ఉండేవాడివి?" అని వీరన్న అడిగాడు.

నాగు నోరు విప్పలేదు.

"పాపం! లక్ష్మిరెడ్డి, కృష్ణయ్య చచ్చిపోయినారు. మన గన్‌మెన్, అన్యాయంగా... ఆ ఎం.ఏ.పిల్లోండ్లల్లో ఒకతనికి కాలుపోయింది. మరొకతనికి కళ్ళు పోయినాయి. ఇంకెంత దూరం పోతాయో ఇవి? ఎందరు చావాలో? ఎందుకు చావాలో? నువ్వూ, రజాక్, సార్‌ను ప్రాణాలకు తెగించి బతికించినారు కదా! హైదరాబాద్ చేరుకున్నాడు". వీరన్న మాటల్లో నాగుకు ఏవి తలకెక్కాయో, ఏవి తలకెక్కలేదో తెలియలేదు.

లక్ష్మిరెడ్డి, కృష్ణయ్య, ఆ ఎం.ఏ. పిల్లల చెల్లాచెదరైన మొండేలు, తలలు, కాళ్ళు, రక్తం, వాళ్ల వికృత రోదన, ఏవేవో ధ్వనులు నాగు కళ్లకు కనబడుతున్నాయి, చెవులకు వినబడుతున్నాయి. అవిగో ఎవరెవరివో మాటలు... మూడు కోతులు.

"నాకు ఈ ఉద్యోగం వద్దు. ఈ కొలువు వద్దు. ఈ దుంపనాశనం వద్దు." నాగు గొణుక్కుంటున్నాడు.

నాగు భార్య ఒక వైపు దిగాలుగా కూర్చొని వుంది. పాపం పుణ్యం తెలియని ఆడపిల్లలిద్దరూ అమ్మ దగ్గర కూర్చొని ఏమీ అర్థంకాక, కనుగుడ్లు అటూ ఇటూ తిప్పుతున్నారు, ఏదో తింటూ.

"ఒకమారు పెండ్లాం పిల్లల దిక్కుచూడు. వాళ్ల కర్మకాలి వాళ్లు చచ్చినారు. నువ్వు బతికినావు, నీ అదృష్టం బాగుండి. నువ్వెందుకు ఉద్యోగం మానాల? ఇంత జరిగి బొజ్జారెడ్డి తన పదవి మానుకుంటాడా, భయపడిపోయి?" నాగు మామ లోకరీతి ఓదార్పు మాటలు మాట్లాడాడు. వీరన్న తన లోలోపల రగులుతున్న మంటను నిగ్రహించుకోలేకపోయాడు:

"మమ్మల్ని వీళ్లకు అడ్డంపెట్టే వాళ్ళున్నంత వరకూ ఏ భయం?" అన్నాడు.

నాగు తన లోకంలోనే తానుంటూ, అదో రకం నవ్వు నవ్వాడు.

● *ఆంధ్రజ్యోతి, ఆదివారం 11-10-98.* ●